

మహిళపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : వీరబల్లి మండలం షికారుపాలెంలో మహిళను చెట్టుకు కట్టేసి కోడిగుడ్లతో కొట్టి హింసించిన వారి మీద కేసు నమోదు చేసి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సభ్యసమాజం మానవత్వం తల దించుకునేలా సాటి మహిళ అని చూడకుండా చట్టాన్ని చేతుల్లో తీసుకోని చెట్టుకు కట్టేసి కోడిగుడ్లతో కొట్టడం ఆటవిక చర్యగా పేర్కొన్నారు. ఒక వేళ తప్పు చేస్తే కేసు పెట్టాలేగాని ఇలా భౌతిక దాడులకు పాల్ప డడం సరియైనది కాదన్నారు. పోలీసులు విచారించి దాడి చేసిన వారి మీద దిశ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా కౌన్సెలింగ్ సమావేశాలు ఏర్పాటు చేసి అటవిక చర్యలకు పోలీస్ అడ్డుకట్ట వేయాలన్నారు. గాయాలు పాలయిన మహిళకు మేరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు రామాంజులు, బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెండో రోజూ క్యూకట్టిన భూ బాధితులు



బాధితులతో మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి రెండోరోజు శుక్రవారం భూ బాధితులి క్యూ కట్టారు. తమ అనుభవంలో ఉన్న భూమిని, తమకు పట్టా ఇచ్చిన భూమిని, తాము కొనుగోలు చేసిన భూములను వైసిపి పాలకులు దౌర్జన్యంగా లాక్కున్నారని, ఆక్రమించుకున్నారని, కబ్జా చేసి అక్రమపట్టాలు పొందారని అర్జీ రూపంలో మొరపెట్టుకున్నారు. తాము అధికారులను ఆశ్రయించిన, పోలీసులకు మొరపెట్టుకున్నా, నాయకులను అభ్యర్థించినా ఏమాత్రం న్యాయం జరగలేదని వాపోయారు. ఎవరి వద్దకు వెళ్లినా, ఎవ్వరిని ఆశ్రయించినా ఆక్రమించుకున్న వారికే, కబ్జాకారులకే వత్తాసు పలికారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎవరికి చెప్పుకోవాలో తెలియక కోర్టు మెట్లను కూడా ఎక్కమన్నారు. కోర్టులో కేసులు ఏళ్ల తరబడి కొనసాగుతుండడంతో ఆ భూమి నే నమ్ముకున్న తమకు కుటుంబ పోషన భారమై కూలి పనులు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యా మీరైనా మాకు న్యాయం చేయండి. ఏళ్ల తరబడి నిరీక్షిస్తు న్నామంటూ రెవెన్యూ పిఎస్ సిసోడియాకు మొరపెట్టుకొని అర్జీలు సమర్పించారు. విజయవాడకు బయలుదేరిన సిసోడియా కొంతమంది బాధితుల వద్ద అర్జీలు తీసుకొని మిగతా వారిని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇవ్వమని సూచించారు. ప్రతి ఒక్క అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అందులో బాధితులకు తప్పకుండా న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. అనంతరం అర్జీదారులకు మద్దతుగా జనసేన నాయకులు రాందాస్ చౌదరి జంగాల శివరామ్ సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాందాస్ చౌదరి మాట్లాడుతూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధితుల్లో తాను మొదటి వాడనని చెప్పారు. వైసిపి అధికారం చేపట్టిన తొలినాళ్లలోనే పుంగనూరు సమీపంలో అన్ని రకాల అనుమతులతో నిర్వహిస్తున్న తన క్వారీకి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అధికారాన్ని అడ్డు పెట్టుకుని మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో భూ బాధితులకు సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ తప్పక న్యాయం చేకూరుస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

1933లో కొన్న భూమిని లాక్కున్నారు



మా తాత రామన్న 1933లో 837, 839, 840, 841 సర్వే నంబర్లలో 10.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఐదేళ్ల క్రితం సదరు స్థలాన్ని తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అనుచరుడు ఉప సర్పంచ్ జగన్నాథం, ములుగోల్లపల్లి సుబ్బారెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకొని తమను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలి.

- శ్రీనివాసులు గురువిందవాండ్లపల్లి, ములకలచెరువు.

పూర్వికుల భూమిని కబ్జా చేశారు



మా అవ్వ సుబ్బమ్మ పేరిట సర్వే నెంబర్ 348లో ఉన్న 3.15 ఎకరాల స్థలాన్ని మూడు తరాల ముందు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ఆ భూమిని నమ్ముకుని, వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాం. పీలేరు మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి అనుచరులు యోగేంద్ర మరో కొంత మంది తమ భూమిని ఆక్రమించుకున్నారు. అధికారులు పట్టించుకోలేదు. న్యాయం జరుగుతుందని ఇక్కడకు వచ్చాము.

- నాగరాజు, లక్ష్మీదేవి దంపతులు, శ్రీనివాసపురం, గుర్రంకొండ.

మిలటరీ పట్టాను కొల్లగొట్టారు



నా భర్త ఆకుల రామాంజులు కొంత కాలం క్రితం మరణించాడు. నా భర్తకు వారి తండ్రి ద్వారా సంక్రమించిన మిలటరీ పట్టా సర్వేనెంబర్ 532/5లో 4.48 ఎకరాల భూమి ఉంది. ఆ భూమిని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మాధవరెడ్డి దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. భూమిలోకి రానివ్వకుండా కంచెవేశాడు. వారి దౌర్జన్యాలకు ఇక్కడ తలదాచుకోలేక బిడ్డతో సహా కడపలోని పుట్టింటికి వెళ్ళిపోయాను. న్యాయం జరుగుతుందని ఇక్కడికి వచ్చాను.

- ఆకుల అన్నపూర్ణ, సిటిఎం, మదనపల్లి.

దస్త్రాల దహనం కేసులో విచారణ కొనసాగుతుంది

- కొంతమంది కార్యాలయ సిబ్బందిపై అనుమానాలు
- మంటల్లో దగ్ధమైన ఫైళ్లను రికవరీ చేస్తాం
- ఫోరెన్సిక్ నివేదిక తర్వాత దోషులను పట్టుకుంటాం
- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం కేసులో విచారణ కొనసాగుతోందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా స్పష్టం చేశారు. గురువారం భూ బాధితుల నుంచి పెద్ద ఎత్తున అర్జీలు స్వీకరించిన సిసోడియా శుక్రవారం మరి కొంతమంది బాధితుల వద్ద అర్జీలు స్వీకరించి విజయవాడ బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె దస్త్రాల దహనం కేసులో కొంతమంది కార్యాలయ సిబ్బందిపై అనుమానం ఉందన్నారు. వీరిపై శాఖా పరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. కొంత మందిపై సస్పెన్షన్ వేటు పడుతుందని, మరి కొంతమందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. భూ కుంభకోణాల్లో ఎక్కువగా ప్రమేయం ఉన్న రైస్‌మిల్ మాధవరెడ్డి పరారీలో ఉన్నాడని, అతని కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని పేర్కొన్నారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 20 ఏళ్లుగా 2.16 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ అయ్యాయని, అందులో 4,400 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో నివేదికలు తెప్పించుకొని వాటి ఆధారంగా తీసుకోవాల్సిన చర్యలు చేపడతామన్నారు. కార్యాలయంలో సుమారు 2,400 ఫైళ్లు దగ్ధమైనట్లు గుర్తించామని వాటిని రికవరీ చేసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా వద్దకు వచ్చిన అర్జీలను పరిశీలించగా దౌర్జన్యంగా ఆక్రమించుకున్న భూములు, డికెటి భూముల రిజిస్ట్రేషన్లు వంటివి వచ్చాయని వాటిని సెక్షన్ 145 ప్రకారం బాధితులకు అప్పగించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇంకా ఎవరైనా దౌర్జన్యాలకు దిగితే పోలీస్ ప్రొటెక్షన్ కూడా కల్పిస్తామన్నారు. కోర్టులో ఉన్న భూ కేసులను కోర్టు పరిధిలోనే న్యాయం జరుగుతుందని సూచించారు. ఇప్పటివరకు తమకు 400 అర్జీలు వచ్చాయని వాటిలో ప్రతి ఒక్క అర్జని పరిశీలించి ఖచ్చితంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యాలయ దహనం కేసు దర్యాప్తు విషయం మాట్లాడుతూ ఫోరెన్సిక్ నివేదిక అనంతరం కెమికల్ ఉపయోగించడం వల్ల అంత మంటలు వచ్చాయా మరే రకమైన ద్రవ పదార్థాలు వాడారా అన్న నిజానిజాలు తెలుస్తాయని, ఆ తరువాతనే దోషులను అరెస్టు చేస్తామన్నారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారిస్తున్నామన్నారు. నాలుగు పోలీసు బృందాలు అదే పనిలో ఉన్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న బాధితురాలు శాంతిప్రియ

భూమిని ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారు

- బాధితురాలు శాంతిప్రియ ఆవేదన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తమ భూమిని ఆక్రమించుకొని మాపైనే దౌర్జన్యం చేస్తున్నారని బి.కొత్తకోట మండలం, కోటావూరు పంచాయతీ, కాండ్లమడుగుకు చెందిన శాంతిప్రియ ఆమె భర్త వెంకటేశ్వర ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోటావూరు పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 386లో 1.25 సెంట్ల భూమి ఉండగా అందులో తమ వాటా 48 సెంట్లు ఉందన్నారు. ఈ భూమి నేషనల్ హైవే పక్కన ఉండడంతో ఇటీవల కాలంలో ధరలు అమాంతం పెరిగిపోయిందని, ఇదే సర్వే నెంబరులో సహ భాగస్తులైన టి.నారాయణ, టి.వెంకటేష్, టి.కృష్ణమూర్తి, టి.హరికృష్ణ, టి.నాగరాజు, టి.సుధాకర్ అనే వ్యక్తులు తమ వాటా 48 సెంట్ల భూమిని ఆక్రమించుకుని తమపైనే దౌర్జన్యం చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పైగా తామే భూములు ఆక్రమించుకున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తమపై దుర్భాషలాడి అనేకమార్లు దాడులు చేసి గాయపరిచడమే కాకుండా ఎఎస్ఐ సమక్షంలో చంపుతామని బెదిరించారని వీడియో క్లిప్పింగ్ చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై బి.కొత్తకోట పోలీసులు, మదనపల్లె డిఎస్‌పి, ఎస్‌పి లకు ఫిర్యాదు చేశామన్నారు. ఇంతవరకు వారిపై ఎటువంటి చర్యలు చేపట్ట లేదన్నారు. సదరు భూమిపై న్యాయస్థానం మాకు ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఇచ్చిందన్నారు. అయినప్పటికీ వారు భూమిలో దుక్కులు చేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీసు ఉన్నతాధికారులు వారి ఆగడాలను అరికట్టాలని, సదరు వ్యక్తుల నుండి తమకు ప్రాణహాని ఉందని, వారి నుండి మాకు రక్షణ కల్పించి, మా వాటా భూమి మాకు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నకిలీ విలేకరిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప జిల్లా చెన్నూరుకు చెందిన నకిలీ విలేకరి మాధవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాజంపేట జర్నలిస్టు యూనియన్ల నాయకులు రూరల్ సిఐ రవీంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఒక కిడ్నాప్ కేసుకు సంబంధించి పత్రికలలో వార్త ప్రచురితమవగా ఆ ఘటనలో భాగస్వామి మాధవరెడ్డి శుక్రవారం మన్నూరులోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో రాజంపేట పాత్రికేయులను అసభ్య పదజాలంతో దూషణలకు పాల్పడ్డాడన్నారు. కడప, చెన్నూరులలో విలేకరినని చెప్పుకుంటూ మాధవరెడ్డి మోసాలకు పాల్పడుతుండేవాడని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్థంభమైన పాత్రికేయులను అసభ్య పదజాలంతో దూషించి నిందించిన మాధవరెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు వెంకటరెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, మందా శివయ్య, రాయులు, ఓబులేసు, రఘురామరాజు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు చేయాలి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి : రాయచోటి కొత్తపల్లి ఏరియాలో కొత్త జూనియర్ కాలేజీ మంజూరు చేయాల్సిందిగా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో దాదాపు 25 వేల మంది జనాభా ఉన్నారున్నారు. వారందరూ మైనార్టీలకు చెందిన ఆటో కార్మికులు, బీడీ కార్మికులు, దినసరి కూలీలు నివాసం ఉంటు జీవనం సాగిస్తున్నారు. కొత్తపల్లిలో ఇప్పటికే 4 ఉర్దూ మీడియం పాఠశాలలు, ఆంగ్ల మాధ్యమం పాఠశాలలు ఉన్నప్పటికీ జూనియర్ కళాశాల మాత్రం చాలా దూరంలో ఉండడంతో మైనార్టీ విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకొని పైచదువులకు వెళ్లకుండా కూలీలుగా మారుతున్నారుని పేర్కొన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని జూనియర్ కాలేజీని మంజూరు చేస్తే పేద కుటుంబాలకు మేలు జరుగుతుందని కోరారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పారామెడికల్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్‌జెఆర్ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో పారా మెడికల్ కోర్సు అభ్యసించాలంటే తిరుపతి, నెల్లూరు, గుంటూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఆసక్తి కలిగి అర్హులైన విద్యార్థులు ఈ సదావకాశాన్ని వినియోగించు కోవాలన్నారు.

ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఉచిత ఇసుకను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, విధానాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. ఇసుకను ఉచితంగా ప్రజలకు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ (ఎక్సైజ్) ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం సాయంత్రం అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలో అమలవుతున్న ఉచిత ఇసుక పాలసీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహిం చారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ సమా వేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీపై ఇచ్చిన జిఓ 43ను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. ఉచిత ఇసుకను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ జిల్లాలో వీలైనన్ని ఎక్కువ ఇసుక రీచ్ పాయింట్లు, ఇసుక డిసిల్టేషన్ పాయింట్లు ఏర్పాటు చేయాలని జిల్లా మైనింగ్ శాఖ, జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఉచిత ఇసుక పాలసీపై ప్రణాళికను రూపొందించు కోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, జిల్లా మైనింగ్ శాఖ అధికారి రవిప్రసాద్, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి భరత్ కుమార్ పాల్గొన్నారు.

'సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి'



సంబేపల్లె : విద్యార్థికి దుస్తులు, బ్యాగు అందజేస్తున్న నరసింహారెడ్డి

ప్రజాశక్తి-సంబేపల్లె(రాయచోటి)

మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని బోధన చేయడం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో భాగంగా సాంకేతిక నైపుణ్యాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ సాధనాలను ఉపయోగించి ఉపాధ్యాయులు బోధన చేయడం వల్ల విద్యార్థుల్లో పఠనం పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ సర్పంచ్ నాగేశ్వరనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం స్టూడెంట్ కిట్‌లో భాగంగా ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా 50 చెత్త బుట్టలను పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రవిశంకర్, విజయ సారధిరెడ్డి, మహబూబ్ బాషా, ఉమాదేవి, జోసెఫ్, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించామని ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. కొత్త బోయినపల్లిలోని ఎస్‌జెఎస్‌ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంకేతిక నైపుణ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యం పెంపొందించడంతోపాటు ఉపాధ్యాయుల పనితీరును,మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాల ప్రదర్శనలను పరిశీలించారు. చిన్నారుల ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ఎం.డి.షఫీ, ఎస్.శారదా, డి.శ్రీలత, పి.శివయ్య, పి.జనార్దన్, దండు సుబ్బారెడ్డి, ఎస్.వి.రామరాజు, ఎన్.అమరావతి, ఎ.శివ ప్రసాద్, ఎస్.ప్రభాకర్‌రావు, పి.ఎల్.ఎన్.వి.ప్రసాద్‌రావు, పీడీ ఎం.ఈశ్వర్ నాయక్, పి.విజయ బాస్కర్, ఎం.రెడ్డి బాబు, బి.శేషగిరి, దార్ల శ్రీనివాసులు ఆచారి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

జిఓ 217 రద్దు హర్షణీయం : జెఎసి



కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్న మత్స్యకారుల జెఎసి సభ్యులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత్స్యకారులకు ఎంతో నష్టం వాటిల్లేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 217ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తామని అసెంబ్లీలో, క్యాబినెట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించడం చాలా సంతోషంగా ఉందని చిత్తూరు జిల్లా మత్స్యకారుల జెఎసి కన్వీనర్ మడితం రమణ, ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి కృష్ణమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేక రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో మత్స్యకారుల పాలిట ఉరితాడుగా ఉన్న జిఓ 217 ను తీసుకొచ్చి మత్స్య కారుల సొసైటీలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నారని అన్నారు. ఆ జిఓ వల్ల మత్స్యకారులకు జీవనాధారమైన 100 హెక్టార్ల కన్నా ఎక్కువ ఉండే చెరువులు, కుంటలు, జలాశయాలను ప్రభుత్వ పరం చేసు కునే దుర్మార్గపు ఆలోచన చేసిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కొల్లు రవీంద్ర, వెంకటేశ్వరరావులు రాష్ట్రవ్యాప్తంగా మత్స్యకారుల జెఎసిని ఏర్పాటు చేయడంతో జిఓ రద్దుకు ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్‌లు కూటమి ప్రభుత్వం రాగానే జిఓ217 రద్దుచేస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని జిఓ రద్దు చేశారని అన్నారు. 3,325 చిన్న తరహా సాగునీటి చెరువులు, 23,920 పంచాయతీ చెరువులు, 118 రిజర్వాయర్లు మత్స్యకారుల సొసైటీలకు దక్కుతాయని అన్నారు. మత్స్య కారుల కుటుంబాలు ఎంతో సంతోషంగా జీవిస్తాయన్నారు. సమావేశంలో సభ్యులు మురళీమోహన్, గంగరాజు, శ్రీనివాసులు, హరినాథ్, వెంకటేష్, వీరాంజనేయులు, మల్లికార్జున, హరిపాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని కోళ్లబైలు పంచాయతీ, మేకలవారిపల్లి గ్రామంలో జిపిఎ పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మదనపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు శివశంకర్, వ్యవసాయ అధికారి నాగప్రసాద్‌లు ప్రారంభించారు. రైతులకు వేరుశనగ పంటలో మేలైన సాగుపద్ధతులు గురించి, పంటకాలం మొత్తంపై శిక్షణ ఇస్తామని తెలిపారు. పంటకాలం పూర్తయిన తర్వాత శిక్షణలో పాల్గొన్న రైతులందరికీ వారి పొలాలకు సంబంధించి ఇండిగాప్ సర్టిఫికేషన్ అందిస్తామని పేర్కొన్నారు. ఈ ధ్రువీకరణ పొందిన ఉత్పత్తులను ఎపిమాస్ ఎన్‌జిఓ నిర్వహిస్తున్న మర్యాద రామన్నపట్నం ఎఫ్‌పిసి లిమిటెడ్ అనే ఎఫ్‌పిఓ ద్వారా మంచి ధరలకు సేకరించనున్నట్లు చెప్పారు. పొలంబడిలో శిక్షణ పొందుతున్న రైతులకు ఎఫ్ఇఓ సంస్థకు మధ్య అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకోవడం జరుగుందని, విత్తనం నుంచి పంట నూర్పిడి వరకు కూడా రైతులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శేఖర్, పృథ్వీరాజ్, సాయిచంద్రమౌళి, మర్యాద రామన్నపట్నం ఎఫ్‌ఫిఓ ప్రతినిధులు వాసుదేవ రెడ్డి, అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో అమలు జరిపిన విద్యారంగ సంస్కరణల ఫలితంగా రాష్ట్ర విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలపై తలిదండ్రుల విశ్వాసం సడలిపోతున్నాయని యుటిఎఫ్ నాయకులు అన్నారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని శుక్రవారం ఎంఇఓ ప్రభాకర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమై పోతున్నాయని పేర్కొన్నారు. పరిస్థితులు విషమించక ముందే ప్రభుత్వం మేల్కొని పరిస్థితులు చక్కదిద్దాలని కోరారు. వివిధ మేనేజ్‌మెంట్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా వున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పనిభారంతో బాటు సమస్యలు పరిష్కారంకాక వారిలో అసంతృప్తి తీవ్రస్థాయిలో ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలకు పరిస్కారం చూపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్, శ్రీనివాసరావు, సురేష్ కుమార్, కుసుమకుమారి, గోపిమూర్తి పాల్గొన్నారు.

అంటువ్యాధులపై ప్రజలకు అవగహన కల్పించాలి

- డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రిలోని డిప్యూటీ డిఎంఎచ్ఓ ప్రధాన కార్యాలయంలో పట్టణ ఆరోగ్య కేంద్రం దొంతివీధి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్తలను, ఆశా కార్యకర్తలను ఉద్దేశించి డాక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సీజనులో మీ సచివాలయాల పరిధిలో అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, అంటు వ్యాధులపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జ్వర పీడితులను త్వరిగతిన గుర్తిస్తూ వారికి సకాలంలో రక్తపరీక్షలు నిర్వహించి తగు చికిత్సను అందించాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాల సీజనులో ప్రజలందరు ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటిస్తూ కాచి వేడి నీటిని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తినేవిధంగా అవగహన కల్పించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు సచివాలయం పరిధిలో ప్రతి ఇల్లు తిరిగి మురుగుగుంటల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి, వేస్ట్ ఆయిల్ బాల్స్ ను వేపించాలని, జ్వరాలు ప్రబలకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొనేవిధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టణ ఆరోగ్యకేంద్ర పరిధిలో ప్రజలకు అందుతున్న ఆర్‌సిఎచ్ ప్రోగ్రాం, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అందుతున్న సేవల మీద, చైల్డ్ సర్వైవ్ గురించి, బిసిజి వాక్సిన్ టార్గెట్స్, లెప్రసి సర్వే గురించి, టిబి కేసుల వివరములు ఆరా తీస్తూ డైయేరియా, డెంగ్యూ, బ్రెస్ట్ ఫీడింగ్ కార్యక్రమం, నిఫా వైరస్, సికెల్ సేల్స్, అనిమియా, ఇమ్మునైజేషన్ తదితర కార్యక్రమాల గురించి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో దొంతి వీధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాల్మన్, జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రణీత్, సూపర్ వైజర్ మహి, ప్రభాకర్, లెప్రసి అధికారి వేణుగోపాల్, షమా, హెల్త్ సెక్రెటరీలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మూతపడిన డ్రైవింగ్ స్కూల్

ఆర్‌టిసి డిపో మేనేజర్ నిర్లక్ష్యమే కారణమా..?

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రవాణా రంగంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఆర్‌టిసిలో డ్రైవింగ్ స్కూల్‌లను ప్రారంభించింది. ప్రతి పార్లమెంట్ కేంద్రంలోనూ ఒక డ్రైవింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేసింది. ఎంపీ నిధులతో నడిచే ఈ డ్రైవింగ్ స్కూళ్లు ప్రభుత్వం నిర్దేశించిన అతి తక్కువ రుసుంతో యువతకు శిక్షణ అందించి లైసెన్సు కూడా అందజేసి ఉపాధి చూపిస్తుంది. రాజంపేట పార్లమెంట్ కేంద్రంలో కూడా 16 బ్యాచ్‌లు దిగ్విజయంగా శిక్షణ పూర్తి చేసుకున్నాయి. రాజంపేట డిపో మేనేజర్ జి.రమణయ్య నిర్లక్ష్య ధోరణి వల్ల గత నాలుగు నెలలుగా డ్రైవింగ్ స్కూల్ మూతపడిందని సిబ్బంది బాహటకంగానే చెప్పుకుంటున్నారు. డిపో మేనేజర్‌కు మరో కీలక అధికారితో సమన్వయ లోపం వల్లనే డ్రైవింగ్ స్కూల్ మూతపడినట్లు సమాచారం. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంత యువత అనేకమంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉపాధి పొందారు. నాలుగు నెలలుగా డ్రైవింగ్ స్కూల్ మూతపడటంతో రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లి ప్రాంతాలకు చెందిన యువత రాజంపేట ఆర్‌టిసి డిపో వైపు ఆశగా వచ్చి నిరాశతో వెను విరిగిపోవడం షరా మామూలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరిపి డ్రైవింగ్ స్కూల్ పునఃప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెట్టుకిందకే పరిమితమైన ఆర్‌టిసి డ్రైవింగ్ స్కూల్ బస్సు

ఫోన్‌కు స్పందించని డిపో మేనేజర్

ఈ విషయమై రాజంపేట ఆర్‌టిసి డిపో మేనేజర్ రమణయ్యను ఫోన్ ద్వారా సంప్రదించగా స్పందించలేదు. గతంలోనూ పలుమార్లు అనేక సమస్యలపై ఆయనను సంప్రదించాలని ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సామాన్యుల నుంచి ఎంతటి వారికైనా ఆయన ఫోన్ ద్వారా స్పందించరని ఆ శాఖలోని కొందరు అధికారులే చెప్పుకోవడం విశేషం.


వృద్ధులను పరీక్షిస్తున్న శంభుప్రసాద్

కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి-కలకడ

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యూక్లియస్ టీం డిప్యూటీ పారామెడికల్ అధికారి శంభుప్రసాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రకోటపల్లిని సందర్శించి సిబ్బందికి పరిశోధన సలహాలు ఇచ్చారు. కుష్టువ్యాధి ప్రారంభ దశలో లక్షణాలను గుర్తించి, చికిత్స ఇప్పించగలిగితే అంగ వైకల్యం నివారించవచ్చు అన్నారు. అనుమానిత కేసు లను గుర్తించి వైద్యశాలకు తీసుకొని రావాలని తెలిపారు. ఫీల్డ్‌లో దీనికి సంబంధించిన సర్వే ఆశ టీమ్‌లు ఎలా నిర్వహిస్తున్నారో పర్యవేక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.జవహర్‌బాబు, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఎం.వెంకటేశ్వరరావు, పిహెచ్ఎన్ కె.సుబ్బరత్న, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.


మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే శ్రీధర్, సాయికిషన్‌రెడ్డి

అభివృద్ధికి సహకరించండి

- మంత్రులను కలిసిన ఎమ్మెల్యే శ్రీధర్, సాయికిషన్‌రెడ్డి

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి తనయుడు సాయి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు నారా లోకేష్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిలను కలిశారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపిస్తే రైల్వే కోడూరు అభివృద్ధి చేసి చూపిస్తామని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చామని ఆ హామీ మేరకు అభివృద్ధి చేసేందుకు సహకారం అందించాలని కోరారు. కోడూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.


డాక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ప్రజలు

ప్రభుత్వ ఆస్పత్రిలో నీటి సమస్య తీర్చాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక పిహెచ్‌సి ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు నెలలుగా నీటి సమస్య ఏర్పడిందని ఈ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం స్థానిక ప్రజలు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట రామయ్యను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిహెచ్‌సికి రోజూ 300 మంది రోగులు వైద్య చికిత్సల కోసం వస్తారని, అందులో 30 నుంచి 35 మంది వరకు ఇన్ పేషెంట్లుగా వైద్య చికిత్సలు పొందుతారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఈ ఆస్పత్రిని 30 పడకల అప్‌గ్రేడ్ ఆస్పత్రిగా ఏర్పాటు చేసి రూ.4.56 కోట్లు అంచనాతో నూతన భవనాన్ని నిర్మించారని అన్నారు. గతంలో ఇక్కడ ఉన్న బోరు భూగర్భ జలాల నీటిమట్టం తగ్గడంతో నీరు ఆగిపోయిందని తెలిపారు. మరమ్మతులు చేసి మోటార్ ఏర్పాటు చేస్తే నీరు వస్తాయని అన్నారు. ఈ విషయంపై డాక్టర్ స్పందిస్తూ నీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని చెప్పారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం స్థానిక ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్నం భోజ నాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మధ్యా హ్నం భోజనం నాణ్యతగా అందించాలని ఆదేశిం చారు. పాఠశాలలో ఉన్న సమస్య లను అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమా ణాలతో విద్య బోధన చేయాలని ఉపా ధ్యాయులకు సూచిం చారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపా ధ్యాలపై ఉందన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచి ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవానలి ఆయన ఆకాంక్షించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు : డిఎంహెచ్ఒ


సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ కొండయ్య

ప్రజాశక్తి-గాలివీడు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో వైద్య సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహనక కల్పించాలని డిఎంహెచ్ఒ ఎన్.కొండయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం నూడువీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టరు, కాన్పులగది, ఇన్ పేషెంట్స్ వార్డును, స్టాక్ రూములను, వ్యాక్సిన్ గదిని పరిశీలించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. క్షయ రోగులను గుర్తించి పిహెచ్‌సి తీసుకెళ్లాలని తెలిపారు. దోమలవ్యాప్తి చెందకుండా దోమ దశ వరకు రాకుండా దోమ లార్వా దశలోనె నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారికి, షుగర్ వ్యాధిగ్రస్తులకు, పొగతాగేవారికి బిసిజి వ్యాక్సిన్ వేయించాలని సిబ్బందికి ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల పోషక విలువలు గురించి తెలుసుకున్నారు. నూలివీడు కాలనీలో ఫ్రైడేడ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్. పి.స్రవంతి రెడ్డి, సూపరిం టెండెంట్ ఎం.దేవేంద్రరెడ్డి, ఎంపిహెచ్ఇఒ శ్రీనివాస్‌రెడ్డి, ఎఎన్ఎంలు,సిబ్బంది పాల్గొన్నారు.

బిసిజి టీకాపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ : బిసిజి టీకాపై జామియా మసీద్‌లో అవగాహన కల్పించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్‌బాబు తెలిపారు. జిల్లా ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న పాపి రెడ్డిగారిపల్లిలో శుక్రవారం ముస్లిములు మసీదుకు రావడంతో వారికి క్షయవ్యాధి హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఎంపిహెచ్ఇఒ జయరామయ్య, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సోమ, గురువారాల్లో వయోజనులకు క్షయ రాకుండా బిసిజి టీకాలు ఆరోగ్య కేంద్రాల్లో వేస్తారని తెలిపారు. 60సంవత్సరాలు పైబడినవారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బీడీలు, సిగరేట్లు తాగేవారు, టిబి వచ్చి తగ్గిపోయి బాగైన వారు, క్షయరోగితో కలసి ఉన్నవారు, ఎత్తుకు తగ్గ బరువు 18 కిలోల కంటే తక్కువ ఉన్న వారు టీకాను తప్పక వేయించుకోవాలని సూచించారు. ఎనుగొండపాలెం తాండ, చీకుచెట్టుపల్లి గ్రామాల్లో104 సేవల కార్యక్రమంలో భాగంగా స్టాప్ డయేరియా, డెంగీ, బిసిజి టీకాల ప్రాముఖ్యత, కుష్టువ్యాధిగ్రస్తుల ఇంటింటి సర్వే పై అవగాహన కల్పిం చినట్లు తెలిపి ర్యాలీ చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జామియా మసీద్ ముతవల్లి, పర్యవేక్షకులు వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీలో సర్పంచ్ మునపాటి ధనలక్ష్మి పంచాయతీ సెక్రెటరీ నాగమణి ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు శుక్రవారం నిర్వ హించారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లి పంచాయతీలోని కొత్తపల్లి గ్రామంలో వీధుల్లో ఉన్న చెత్తాచెదారం, ఊరు అనుకోని ఉన్న దిబ్బలు, కంపచెట్లు తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండే చోట బ్లీచింగ్, సున్నం చల్లించారు. కొత్తపల్లి నుంచి గువ్వల చెరువు వరకు రోడ్డు ఇరు వైపులా ఉన్న ముళ్లకంప, పిచ్చి మొక్కలను తొలగించారు. గువ్వల చెరువు పైభాగంలో నుంచి నాయుని చెరువుకు వచ్చే సప్లై ఛానల్ లోఉన్న కంప పొదలను జెసిబి సహాయంతో తొలగించి కూలీలతో పనులు చేపట్టి వాటిని శుభ్రం చేయించారు. ప్రజలకు కూడా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులుదూరమవుతాయని అన్నారు. దోమల నియంత్రణ చేపట్టాలన్నారు. కార్యక్ర మంలో తిమ్మారెడ్డి, రమేష్, రమణ, రాజా, భాస్కర పాల్గొన్నారు.


పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కూలీలు

అమరవీరుల త్యాగాలు మరువలేనివి


పీలేరులో అమరవీరులకు నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పీలేరు

కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి కనీస బాధ్యతని ఎంఇఒ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. కార్గిల్ యుద్ధం జరిగి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం స్థానిక జడ్‌పి ప్రధాన ఉన్నత పాఠశాలలో విజయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా అమరవీరులకు క్యాండిల్స్ వెలిగించి నివాళులు అర్పించారు. ఎంఇఒ మాట్లాడుతూ 1999 మే నెలలో పాకిస్తాన్ సైన్యం భారత భూభాగమైన కాశ్మీర్ లోకి దొంగ చాటున చొరబడ్డారన్నారు. ఈ సందర్భంగా భారత సైన్యం సుమారు రెండు నెలల పాటు పాకిస్తాన్ సైన్యంపై యుద్ధం చేసి మన సత్తా ఏంటో చాటారని చెప్పారు. మన దేశ సైన్యం నుంచి 500 మందికిపైగా వీర జవాన్లు ప్రాణాలు కోల్పోయినప్పటికీ, మొక్కవోని ధైర్యంతో పౌరుషంగా మరింత ముందుకు దూసుకు వెళ్లి ప్రత్యర్థుల వ్యూహాలను ఛేదిస్తూ వారిని మట్టి కరిపించారని అన్నారు. అమరులైన మన వీర జవాన్ల పోరాటాన్ని, ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారికి సంతాపం తెలపడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో స్థానిక మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సురేంద్ర నాథరెడ్డి, సహాయ ప్రధానోపాధ్యాయుడు పి. ప్యారూ ఖాన్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, అదనపు ఎస్ఐ రమణ హాజరై క్రొవ్వువత్తులతో వీర జవాన్లకు ఘనంగా నివాళులు అర్పించారు. **మదనపల్లె అర్బన్:** పట్టణంలోని సొసైటీ కాలనీలోని విజయభారతి పాఠశాలలో కార్గిల్ విజయ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన భారత సైనికులకు కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బండి ఆనంద్, గుడ్ విల్ కంప్యూటర్స్ వ్యవస్థాపకుడు అజయ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.**'మిట్స్' ఆధ్వర్యంలో** మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కారక్రమంలో కళాశాల అడ్వైసర్ డాక్టర్ తులసీరామ్ నాయుడు మాట్లాడుతూ మే–జులై 1999 లో కార్గిల్ డిస్ట్రిక్, కాశ్మీర్ లో భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన నాలుగో భీకర సంగ్రామంలో పాకిస్థాన్ ఆక్రమించు కున్న టైగర్ హిల్స్‌ను స్వాధీన పరుచుకొని భారత దేశ ఔన్యత్యాన్ని , దేశం యొక్క కీర్తి పతాకాన్ని ఎగరవేసి ప్రపంచ దేశాలకు భారత దేశ సైనిక సత్తాను తెలియజేశారని అన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్ట్ నెంట్ డాక్టర్ ఎన్.నవీన్ కుమార్, ఎన్ఎస్ఎస్ కో –ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కొత్తపేట జడ్‌పి హైస్కూల్‌లో పాఠశాల ప్రధానో పాధ్యాయులు మల్లికార్జున ఆధ్వ ర్యంలో కార్గిల్ విజయ్‌దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అమరవీరులకు ఘనంగా నివాళి అర్పించారు. భారత ప్రభుత్వం ఆపరేషన్ విజయ్ పేరుతో నిర్వహించిన కార్గిల్ యుద్ధంలో సైనికుల పోరాటాలు ఫలి తంగా 1999, జులై 22న విజయపతాకం ఎగురవేసిందని అన్నారు. యుద్ధం జరిగి నేటికి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా అమరవీరుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, పీడీ బాలశేఖర్, సురేంద్ర, ప్రసాద్, సుకన్య, ఇంద్రావతి, చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.


మదనపల్లి: కార్గిల్ దివస్ కార్యక్రమంలో ఎన్‌సిసి విద్యార్థులు

నీలి నాలుకపై అప్రమత్తంగా ఉండాలి



మేకలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గొర్రెలు, మేకల్లో కాలానుగుణంగా వచ్చే నీలి నాలుక వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. శుక్రవారం ముష్టూరు పంచాయతీలోని ఎర్రప్పగారిపల్లెలో నీలి నాలుక వ్యాధి నివారణకై వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలకు, మేకలకు వచ్చే సీజనల్ వ్యాధులపై గొర్రెల, మేకల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. సాధారణంగా బ్లూ టంగ్ వ్యాధి దోమకాటు వలన వ్యాప్తి చెందుతుందని అన్నారు. నీలి నాలుక వ్యాధి సోకిన గొర్రెల్లో మూతి పుండ్లు కావడం, ముక్కు నుంచి స్రావాలు కారడం, దగ్గు మొదలైన లక్షణాలతో అనారోగ్యం బారిన పడి మృతిచెందే అవకాశం ఉందని అన్నారు. వ్యాధి సోకిన గొర్రెలు, మేకలను మంద నుంచి వేరుచేసి రోగ నిరోధక టీకాలను వేయాలని సూచించారు. మందలో దోమలు ప్రబలకుండా సాయంత్రం వేళలో వేపాకు పొగ పెట్టడం ద్వారా దోమలను నివారించి బ్లూ టంగ్ వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చు అన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా నష్టపోయే అవకాశం పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శాంతి, బాలాజీ, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు పెట్టుకోవాలి : డిఇఒ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలు లక్ష్యంగా పెట్టుకోవాలని డిఇఒ శివప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎపి మోడల్ స్కూల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆయన విద్యార్థులతో కలిసి భోంచేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి బోధన విధానం, టిఎల్ఎం సిబిఎస్ఇ, స్టేట్ సిలబస్ రెండిటిని పూర్తిస్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు కిట్‌లు అందించరాలేదని అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ డైరీలను ఆయన పరిశీలిం చారు. రాబోయే 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో 100శాతం ఫలితాలు సాధించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని అన్నారు. స్కిల్ డే శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో ఆయ న సంభాషించారు. బోధన డిజిటల్ లైజేషన్‌ను ఎలా ఉపయోగించుకోవాలనే విషయాలపై విద్యార్థులకు సూచించారు. రాబోయే కాలంలో విద్యా ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలని, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా ర్థులు పెంపొందించు కోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించినప్పుడే తల్లిదండ్రులకు పాఠశాలకు పేరు వస్తుం దని అన్నారు. పాఠ శాలల్లో నూతన విద్యా విధానం, సిబిఎస్ఇ సిలబస్‌ను విద్యార్థులు వరంలా భావించి చదువుకోవాలని అన్నారు. ప్రతి పాఠశాలలోనూ విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు అహర్నిశలు కృషి చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఎంఇఒలు చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి, కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ నాగయ్య పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి


కోటాకడపల్లి రైతు సేవా కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న సత్యనారాయణ

రైతు సేవా కేంద్రంలో రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని కోటకడపల్లి రైతు సేవా కేంద్రంలో శుక్రవారం పశు సంవర్ధక శాఖ, మదనపల్లె డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ సత్యనారాయణ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్షకాలంలో పశువులు పెంపకంపై రైతులకు తీసు కోవల సిన జాగ్రత్తలు రైతులకు వివ రించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను, పశువుల టీకాల కార్యక్ర మాలను క్షేత్ర స్థాయిలో రైతులకు సద్వినియోగం అయ్యేలా చూడాలని ఆదేశించారు. కార్యక్ర మంలో పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, పశు వైద్య సహాయకుడు గుణశేఖర్ పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందిన అనంతరం మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయుటకుగాను సాంకేతిక విద్యాశాఖా డైరెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 వ తరగతితో పాటు పాలిసెట్ ఉత్తీర్ణతపొంది పాలిటెక్నిక్‌లో చేరదలుచుకున్న విద్యార్థులు ఈ నెల 30న సాయంత్రం 5గంటల లోపు కార్యాలయంలో దర ఖాస్తు చేసుకుని 31న ఒరిజినల్ సర్టిఫికేట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరములకు 9505504200 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

స్థానిక మండల కేంద్రం పెద్దమండ్యంలో బస్టాండ్ సమీపంలోని ప్రాథమిక పాఠశాలలో మదనపల్లి రామాలయ ఆస్పత్రిలో ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ గుడి నాగరాజు తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు చేసి, ఆపరేషన్ అవసరమైన వారికి కుట్టు లేకుండా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ముళ్ల కంపను తొలగిస్తున్న జెసిబి

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న వ్యర్థాలు తొలగింపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లిపేట గ్రామ టిడిపి నాయకులు శివాజీ, కుమార్ ఆధ్వ ర్యంలో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను, చెత్త దిబ్బలను, ప్లాస్టిక్, తదితర వాటిని జెసిబి ద్వారా తొలగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్త దిబ్బలు గ్రామానికి వెలుపల ఉండటం ద్వారా గ్రామస్తులు ఆరోగ్యకరంగా ఉంటారని అన్నారు. రానున్నది శీతాకాలం కాబట్టి గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో చుట్టుపక్కల ఉన్న చెత్త దెబ్బలను పరిశుభ్రం చేసినట్లు తెలిపరు. రైల్వే కోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ సహకారంతో రెడ్డిపల్లి పంచాయతీని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

ఝరికోన ప్రాజెక్టును పరిశీలించిన 'సుగవాసి'

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ఝరికోన ప్రాజెక్టును రాజంపేట నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం, జనసేన పార్టీ నాయకులు నంద్యాలరెడ్డి రాణి, టిడిపి మాజీ మండలఅధ్యక్షులు శివకుమార్ నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఝరికోన ప్రాజెక్టుతో ఎంతో మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారని అన్నారు. ప్రాజెక్టుగేట్లకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎల్లమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తాం

-ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-కలికిరి


ఎల్లమ్మ దేవత ప్రతిమ

మండల కేంద్రం కలికిరిలో కొలువైన ఎల్లమ్మ దేవత ఉత్సవాలను ప్రతి ఆషాఢ మాసంలో శుక్ల ఏకాదశి శనివారం నుంచి ప్రారంభిస్తారని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌రెడ్డి తెలిపారు. రెండవ ఆదివారం మధ్యాహ్నం తర్వాత నుంచి బోనాలు సమర్పిసారని, మూడ వరోజు సోమవారం అమ్మవారి సర్వదర్శనంతో పాటు వినోద కార్యక్రమాలు మొదలు పెట్టి, నాలుగవ రోజు మంగళవారం పానేట, కాల్లిపాటు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో కలికిరి ఎల్లమ్మకు జాతర అత్యంత వైభవంగా జరుగుతుందనే పేరు నేటికీ ఉందని అన్నారు. ఎల్లమ్మ తల్లిక పట్టణంలోని బంగారు పిచ్చుక అని పిలవబడే దానగుణం దైవ భక్తి కలిగిన ప్రస్తుత సర్పంచ్ రెడ్డి వారి ప్రతాప్ కుమార్ రెడ్డి ముత్తాత రెడ్డి వారి గంగిరెడ్డి గ్రామ ప్రజలతో కలిసి కలికిరికి దక్షిణాన సరిహద్దులోని తన పొలంలో ఆలయాన్ని నిర్మించారన్నారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యాశాఖ సరఫరా చేసినటువంటి" స్టూడెంట్ కిట్స్' కు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, బెల్టు, యూనిఫామ్, బ్యాగులు, షర్టు, సాక్సులను శుక్రవారం ఎంఇఒలు మనోహర్, గాజుల రామకృష్ణ పాఠశాలలకు అందజేశారు. మోడల్ కాలేజి, కలిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించారు.

మంత్రి లోకేష్‌తో జకియాఖానం భేటీ

ప్రజాశక్తి రాయచోటి

శాసనమండలి లాబీలో మంత్రి నారా లోకేష్‌ను వైసిపి ఎమ్మెల్సీ, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం కలిశారు. ఇప్పటికే మంత్రి ఫరూక్‌తో భేటీ అయిన జకియా ఖానం, శుక్రవారం కుటుంబసభ్యులతో లోకేష్‌ను కలిశారు. వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభల్ని బహిష్కరించినా, జకియా ఖానం మండలికి హాజరవుతున్నారరు. త్వరలో ఆమె టిడిపిలో చేరుతున్నారంటూ పార్టీ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.


కుటుంబ సభ్యులతో లోకేష్‌ను కలిసిన శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం